పెరిగిన నేరాలు

- ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో 9570 కేసులు
- 59 మందికి జైలుశిక్ష, 5 మందికి జీవితఖైదు

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో 9 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. 2022 కంటే ఈ ఏడాది 2023లో పెద్ద ఎత్తున క్రైమ్ పెరిగింది. పోలీసులు నేరల నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్న క్రైమ్‌రేట్ పెరుగుతూనే ఉంది. దొంగతనాలు కొంత మేరకు తగ్గినప్పటికీ సైబర్ నేరాలు భారీగా పెరిగాయి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అందుబాటులో న్యాయంకోసం, పెరుగుతున్న నేరాలను తగ్గించేందుకు ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లను మహేశ్వరం జోన్‌లో కలిపారు. నూతనంగా నాగోల్‌లో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో ఎల్‌బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చైతన్యపురి, నాగోలు, మీర్‌పేట, మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 9 పోలీస్‌స్టేషన్ పరిధిలో 9570 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

- వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ గంజాయి కేసులు 76 నమోదు కాగా.. 2461 కేజీల గంజాయి, 11 కిలోల పాపిస్ట్రా, 360 గ్రాములు హెరాయిన్, 65 గ్రాముల ఎండీఎంఏ, 170 గ్రాముల ఓపీఎం స్వాధీనం చేసుకుని 105 మందిని అరెస్టు చేశారు.
- 99 అత్యాచార కేసులు, 22 హత్య కేసులు, 146 కిడ్నాప్ కేసులు, వివిధ రకాల దొంగతనాల కేసులు 1465 నమోదయ్యాయి. 877 రోడ్డు ప్రమాదాలు జరగగా.. చనిపోయిన వారు 136 మంది పలు రకాల చీటింగ్ కేసులు 1152 నమోదయ్యాయి.
- వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో 32,518 ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. పేకాట నిర్వహిస్తున్న ఆరు ఇళ్లను సీజ్ చేశారు. వ్యభిచారం నుంచి 47 మంది మహిళలను రక్షించారు.
- 1,159 మిస్సింగ్ కేసులు నమోదు కాగా.. 1,019 మంది ఆచూకీని పోలీసులు కనిపెట్టి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చోరీ కేసుల్లో పోయిన ఆస్తి విలువ రూ. 8,34 కోట్లు కాగా.. దాదాపు 63,16 శాతం రూ.5.27 కోట్ల ఆస్తిని రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.
- మొత్తంగా జోన్‌లో ఈ ఏడాది సుమారు 5 కేసులు సంచలనం సృష్టించాయని పోలీసులు చెబుతున్నారు. 40 కేసుల్లో 59 మందికి రంగారెడ్డి జిల్లా కోర్టు శిక్ష వేయడంతో పాటు అందులో 5 మందికి జీవిత ఖైదు విధించినట్లు ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు.

ఈ ఏడాది ఎల్‌బీనగర్ పరిధిలో సంచలన కేసులు..

సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తన సోదరిని వివాహం చేసుకున్నాడన్న కోపంతో నాగరాజు అనే యువకుడిని ఆమె అన్న, బావలు కిరాతకంగా హత్య చేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి పక్కా ఆధారాలు సమర్పించడంతో, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో హాజరుపర్చగా.. హత్య కేసుల్లో నిందితులకు యావజ్జీవ శిక్ష వేసింది.

- మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాచ్‌మెన్‌గా ఉన్న మహిళ (40)ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఒంటిపై ఉన్న నగల కోసం కాల్చి చంపారు.
- మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక రౌడీషీటర్‌తో పాటుగా మరో ఇద్దరు కలిసి గంజాయి సేవించి మైనర్ బాలికపై అత్యాచారం చేశారు.
- వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో తన భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఓ కానిస్టేబుల్ అతని భార్యను బిల్డింగ్‌పై నుంచి తోసివేశాడు. వారి పిల్లలను సైతం చంపేందుకు యత్నించగా.. స్థానికుల సాయంతో పిల్లలు బతికారు.
- ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గిరిజన మహిళ అర్ధరాత్రి రోడ్డుపై ఉండగా ఆమెపై అనుమానం వచ్చిన పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి ఆమెను చితకబాదారు. ఈ కేసులో ఓ ఎస్సై, హోంగార్డును బదిలీ చేసి, ముగ్గురుపై సస్పెన్షన్ వేటు చేశారు.
- ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రేమించిన యువతి మాట్లాడడం లేదని, పట్టపగాలే ఓ ప్రేమోన్మాది ఇంట్లో చొరబడి ప్రేమించిన యువతి సంఘవి, ఆమె తమ్ముడిపై కత్తితో దాడిచేసిన ఘటనలో యువతి తమ్ముడు తీవ్ర గాయాలతో మృతి చెందాడు.
- నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగోలు సాయినగర్‌కాలనీలో భార్యభర్తల మధ్య ఏర్పడిన వివాదంలో రాజు, తన భార్య సంతోషిని హత్యచేసి తాను ఆత్మహత్య చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

నేరాల అదుపునకు నిరంతరం కృషి..



ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో నమోదైన కేసులు 90 శాతం పరిష్కారమయ్యేలా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం. దీంతో నేరాలు తగ్గే అవకాశం ఉంటుంది. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు కొత్త సంవత్సరంలోనూ నేరాల నిర్మూలనతో పాటు మహిళల భద్రత, చోరీల అడ్డుకట్ట, ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని బాధితులకు సత్వరన్యాయం చేస్తాం.

– ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో..) టమాటా రూ.19, వంకాయ రూ.45, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, కాకర 58, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 14, క్యారెట్ 32, దొండ 45, ఆలుగడ్డ 21, ఉల్లిగడ్డ 26, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.25, సొరకాయ రూ.15, పొట్లకాయ 13, అరటికాయ 09, చిక్కుడు రూ.65, అర్వి 45, మునగ 85, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర రూ.13, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ రూ.55గా ఉన్నాయి. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

దుప్పట్ల పంపిణీ

నాగోలు: కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్‌లోని చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నాగోలు, ఎల్‌బీనగర్, కొత్తపేట, బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్‌లో పేదలు, అనాథలు, యాచకులు, దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిమ్మపూడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. ప్రతి చలికాలంలో దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సభ్యులు అప్పాజీ శ్రీనివాస్, రవికుమార్, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, సుజాత, మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులున్నారు.

వాలంటీర్లు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం ఆరు పథకాలపై జీహెచ్‌ఎంసీ వాలంటీర్లు ప్రజలు అవగాహన కల్పించాలని గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీ కమ్యూనిటీహాల్, శారదానగర్‌లోని కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించామన్నారు. డివిజన్‌లో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశామని అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలను కాపాడాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

హస్తినాపురం: శాంతి భద్రతల పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డితో కలిసి పోలీస్‌స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారందరికీ సహకరించిన వారికి కావాల్సిన సహకారాన్ని అందించాలని ఎవరినీ ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. వనస్థలిపురం సీఐ జలేందర్ రెడ్డి,డీఐ వెంకట్, ఎస్సైలు, సిబ్బంది తదితరులున్నారు.

హోటళ్లు, మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీసీపీ రోహిత్‌రాజు

సైదాబాద్: డిసెంబర్ 31న హోటల్, మద్యం దుకాణాల వ్యాపారులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదురాజు రోహిత్‌రాజు ఆదేశించారు. శనివారం సైదాబాద్‌లోని తన కార్యాలయంలో జోన్ పరిధిలోని 10 పోలీస్‌స్టేషన్ల అధికారులు, హోటల్ మద్యం దుకాణాల వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాపులు సకాలంలో మూసివేసి ప్రభుత్వం ఇచ్చిన సమయపాలన పాటించాలన్నారు. దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అవి పరిసర ప్రాంతాలు ఉండేలా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జోన్ అధికారులు, 10 పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం


పరిష్కార పత్రాన్ని అందజేస్తున్న జడ్జి సల్మా ఫాతిమా

హయత్‌నగర్: కేసుల పరిష్కారానికి దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని దీనికి కోర్టు తగిన అవకాశాలను కల్పిస్తుందని హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి సల్మా ఫాతీమా అన్నారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 3570 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కోర్టులలో కేసులు పేరుకుపోకుండా రాజీకి అర్హత ఉన్న కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. అదనపు జడ్జి సంకేత్ మిత్ర, రిటైర్డ్ జడ్జి రవికుమార్, ఏపీపీ అరుణోదయకుమార్ తదితరులున్నారు.

ఇంక్యుబేటర్స్ అవార్డు ప్రదానం


అవార్డును అందుకున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

నాగోలు: నూతన ఆవిష్కరణలకు అండగా నిలిచిన ఎల్‌బీనగర్ అవినాష్ డిగ్రీ కళాశాలకు ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్ వారిచేత ఉత్తమ ఇంక్యుబేటర్ అవార్డును శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ హెచ్. డి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతు సచ్‌దేవ్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ హైయర్ ఎడ్యుకేషన్ వెంకటేశం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ముఖ్య అతిథులు విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ రవీందర్, రిజిస్టర్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ. సీఈఓ హఫీజ్‌బాషా, ప్రొఫెసర్ విద్యాసాగర్ అభినందించారు. సహకారం అందించిన వారికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.


స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా శనివారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీల నుంచి సాగర్ హైవే రోడ్డు వరకు రెండు ప్రధాన రోడ్లు ఉన్నాయని, ప్రస్తుతం అధ్వాన్నంగా తయారైనందున రోడ్లు నిర్మించాలని కోరారు. కాలనీల ఆవరణలో ఉన్న పార్కు అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి దానికి ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో నూతన రోడ్లను నిర్మిస్తామని, పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవికుమార్, కాలనీవాసులు యాదవ్‌రెడ్డి, నవీన్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


పరిశీలిస్తున్న డీఆర్‌డీఎస్ సైంటిస్ట్ రాజ్‌కుమార్

నాగోలు: కొత్తపేటలోని బచ్‌పన్, అకాడమిక్ హైట్స్ పాఠశాలలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు తయారు చేసి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఎల్ సైంటిస్ట్ రాజ్ కుమార్ పాల్గొని, మాట్లాడుతూ.. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభాపాటవాలు బయటకు వస్తాయని తెలిపారు. పాఠశాల రీజనల్ అకాడమిక్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవీలు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు వైజ్ఞానిక, సృజనాత్మకమైన ప్రాజెక్టులు, ఆటపాటలు ఎంతో అవసరమని వారికి మనోధైర్యం, ఆలోచనా శక్తిని పెంచుతాయని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ స్వీటీ, కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులున్నారు.

వనస్థలిపురం స్కూల్‌లో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని బచ్‌పన్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యాసంస్థ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలనతో విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో వివిధ అంశాలపై విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.



స్టీల్‌బ్రిడ్జి ప్లాన్‌పై ఫిర్యాదు


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

- విచారణకు ఆదేశించిన కమిషనర్ రోనాల్డ్‌రాస్
- పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

చంచల్‌గూడ: ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, ఒక బహుళ అంతస్తుల భవనాన్ని కాపాడేందుకు బ్రిడ్జి ప్లాన్ హనుమాన్ దేవాలయం మీదుగా మార్చారని శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌ను కలిసి బీజేపీ నాయకులు, ఆలయం కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. సైదాబాద్ మెయిన్ రోడ్డుపై పురాతన హనుమాన్ దేవాలయం ఉంది. ఆ దేవాలయంలో నవగ్రహాల మందిరం, శివాలయం, గణపతి దేవాలయాలు కూడా ఉన్నాయి. రూ. 523 కోట్లతో చంచల్‌గూడ నుంచి సంతోషనగర్ వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం పూనుకుంది. 2020లో సైదాబాద్ మెయిన్‌లో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సంబంధిత శాఖ అధికారులు మార్కింగ్ చేస్తున్న క్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు హామీ ఇచ్చారు. కాగా ఇటీవల ఆలయానికి ఇరువైపులా పిల్లర్లు ఏర్పాటు చేసిన క్రమంలో బ్రిడ్జి ఆలయం మీదుగా వెళ్తున్నట్లు భక్తులు, నాయకులు గుర్తించారు. ఓ బహుళ అంతస్తుల భవనాన్ని కాపాడేందుకే అధికారులు ప్లాన్ మార్చి ఆలయానికి ఇబ్బందులు కల్గిస్తున్నట్లు ఆరోపించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ రోడ్డుకు మధ్యన ఉండాల్సిన బ్రిడ్జి పిల్లర్లు పూర్తిగా పక్కకు ఉండటంపై అధికారులను ఆరా తీశారు. విచారణకు ఆదేశించిన కమిషనర్ సైదాబాద్‌లో పర్యటించి పరిస్థితిని తెలుసుకుని పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రాజెక్టు అధికారులను కోరారు. బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకుడు సతీష్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సహదేవ్‌యాదవ్, న్యాయవాది వినయ్‌కిషోర్, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, శ్రీనాథ్, వెంకట్‌రెడ్డి, అరవింద్, వినోద్, క్రాంతి తదితరులున్నారు.

యువకుడి మృతికి కారణమైన డ్రైవర్ రిమాండ్

- ఈనెల 6న రోడ్డు దాటుతుండగా ప్రమాదం

చాదర్‌ఘాట్: రోడ్డు దాటుతున్న యువకుడి మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న రాత్రి సమయంలో ప్రైవేట్ ఉద్యోగి శ్రవణ్‌కుమార్ నల్గొండ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఈనెల 8న మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా తెలవడంతో అప్పట్లో అతడి బంధువులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సీసీపుటేజీలను పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారుడ్రైవర్ నాగోల్‌కు చెందిన సూర్యప్రకాష్‌రెడ్డిగా గుర్తించారు. ఆరోజు ఇంటి నుంచి తన కారులో స్నేహితులతో కలిసి పాతబస్తీలోని హోటల్‌కు వెళ్తూ.. మలక్‌పేటలో రోడ్డు దాటుతున్న శ్రవణ్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. శనివారం చాదర్‌ఘాట్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- 2.4 కేజీల గంజాయి స్వాధీనం

చైతన్యపురి: నిషేధిత గంజాయిని కొనుగోలు చేసి అవసరమైన వారికి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను మహేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకుని 2.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీలేరు నుంచి నిషిద్ధ గంజాయి తీసుకొచ్చి దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి దండ ఉదయ్‌రెడ్డి (21), యాదగిరి శివశంకర్ (21), చల్లపల్లి భార్గవ్ (21)లను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా విద్యార్థులు కాగా గంజాయికి అలవాటుపడి తమతో పాటు మరి కొందరికి సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. సీలేరుకు చెందిన దారాబాబు అనే వ్యక్తి వీరికి వనస్థలిపురానికి చెందిన యల్లపర్తి లోకేష్ ద్వారా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితుల నుంచి ఎండు గంజాయి రెండు కేజీలు, లూజ్ గంజాయి 400 గ్రాములు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ప్రధాన నిందితుడు దారాబాబు, యల్లవర్తి లోకేష్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

షణ్ముఖ కుటుంబానికి అండగా ఉంటాం


పరామర్శిస్తున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్ తదితరులు

బీజేపీ ఎంపీ బండి సంజయ్

చైతన్యపురి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరామోజు షణ్ముఖ (జన్నన్న) కుటుంబ సభ్యులను ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పరామర్శించారు. చైతన్యపురి ప్రభాత్‌నగర్‌లోని ఆయన నివాసంలో సతీమణి శోభరాణి, కుమార్తె తేజస్విలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న ఆయన మరణం తీరని లోటన్నారు.

షణ్ముఖ సంతాప సభ..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామోజు షణ్ముఖ సంతాప సభ శనివారం చైతన్యపురిలో నిర్వహించారు. సీనియర్ నాయకుడు దాసరి మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, పేరాల శేఖర్‌రావులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత సాంబమూర్తి, అధికార ప్రతినిధి దిలీప్, సంఘ ప్రముఖ్ రాంచంద్రయ్య, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కాచం సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేటర్లు రంగా నర్సింహ్మగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్ బీజేపీ నాయకులు లక్ష్మణ్‌జీ, రుద్రారపు శంకర్, వేణుగోపాల్‌చారి. శివ ఓజా, షణ్ముఖ అభిమానులు, స్నేహితులు పాల్గొన్నారు.

సాంప్రదాయాల గొప్పతనం చాటి చెప్పాలి


సాంప్రదాయ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మలక్‌పేట: మన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనం చాటి చెప్పాలని వోక్సెన్ యూనివర్సిటీ కార్పొరేట్ రిలేషన్స్ ఏజీఎం సరిత తాళ్లపల్లి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ దిల్‌సుఖ్‌నగర్ అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో 'పరంపర' పేరుతో శనివారం నిర్వహించిన 'సాంప్రదాయ దినోత్సవ' వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు దసరా, రంజాన్, దీపావళి, సంక్రాతి, క్రిస్మస్ పర్వదినాలకు సంబంధించిన దుస్తుల్లో సందడి చేశారు. తరగతి గదులను రంగురంగుల ముగ్గులతో అందంగా అలంకరించి పండుగల విశిష్టతను వివరించారు. సాంప్రదాయ నృత్యాలు, ఆట, పాటలతో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అడ్మిన్ ఆఫీసర్ మోహన్‌రావులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం గ్యారంటీ పథకాలను అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మన్సూరాబాద్, నాగోలు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుల, మత, పార్టీ బేధాలు చూడకుండా ప్రజలందరి అభ్యున్నతి, అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. నాయకులు నాంపల్లి శంకరయ్య, పృథ్వీరాజ్, విఠల్‌రెడ్డి, రఘుపతి, గిరి తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం..

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సకలజన హితం ప్రగతి పథం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్ కమ్యూనిటీహాల్ వార్డ్ ఆఫీస్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలనలో భాగంగా అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి పథకాల లబ్ధిదారులకు దరఖాస్తు ఫారాలను నింపి అధికారులకు అందజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాటి రమేష్‌నేత, నగేష్, డివిజన్ మహిళ అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మి, రేణుక, పాండు తదితరులున్నారు

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు..

మలక్‌పేట: ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అభయహస్తం ఆరు గ్యారంటీల స్వీకరణ కేంద్రాలను శనివారం సందర్శించి ప్రజలకు దరఖాస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సెంటర్లలో అధికారుల దగ్గర అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తులు ఎవరూ బయటకొనొద్దని వివరించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడ్డిఅన్నారంలో..

గడ్డి అన్నారం రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సంఘిరెడ్డి, పార్టీ మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్ సందర్శించారు. ప్రజలకు దరఖాస్తులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సీనియర్ నాయకులు శ్యామ్‌రావు, ధర్మేందర్, అనంతయ్య, బొట్టు శ్రీను తదితరులున్నారు.


పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


లబ్ధిదారులకు దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి


దరఖాస్తులను అందజేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల